క్లుప్తంగా

ఎన్‌ఎస్‌టీఎల్‌లో స్వచ్ఛతా ర్యాలీ



ఎన్‌ఎస్‌టీఎల్ వద్ద ర్యాలీలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, ఉద్యోగులు

గోపాలపట్నం: ఎన్‌ఎస్‌టీఎల్‌లో గురువారం స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా గృహ సముదాయాల ప్రాంతంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్‌ఎస్‌టీఎల్ డైరెక్ట్ డాక్టర్ బ్రహం వర్గీస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులు వాడకూడదని, క్లాత్ బ్యాగులు వినియోగించాలని సూచించారు. పర్యావరణ హితంగా అందరం మసలుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సత్యశ్రీనివాస్, లెఫ్టినెంట్ కల్నల్ రాహుల్ దీక్షిత్, శాస్త్రవేత్తలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ క్రీడలో బాలిక సత్తా



అంతర్జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్రీడలో బ్రాంజ్ మెండల్ సాధించిన ఆప్తి వర్ణిక

గోపాలపట్నం: అంతర్జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్రీడలో బ్రాంజ్ మెడల్ సాధించిన సామర్ల కోటకు చెందిన ఆప్తి వర్ణిక శేఖర్‌కు గురువారం విశాఖ విమానాశ్రయంలో కుటుంబ సభ్యులు ఆప్యాయంగా స్వాగతం పలికారు. మలేషియాలో ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ మలేషియా నిర్వహించిన ఈ పోటీల్లో అండర్–12 కేటగిరీలో వర్ణిక సత్తా చాటి కాంస్య పతకం సాధించింది. తమ కుమార్తె 5వ తరగతి చదువుతోందని, ఫెన్సింగ్ క్రీడలో రాణిస్తోందని బాలిక తల్లి తెలిపారు. కోచ్ రామకృష్ణ శిక్షణ వల్ల మెడల్ గెలిచానని వర్ణిక తెలిపింది. భారత్‌కు బ్రాంజ్ మెడల్ సాధించడం గర్వంగా ఉందని ఆనందం వ్యక్తం చేసింది.

విద్యుత్ లైట్ల సమస్యకు పరిష్కారం



ఏకేసీ కాలనీలో విద్యుత్ లైట్ల ఏర్పాటును పరిశీలిస్తున్న మధుబాబు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో విద్యుత్ లైట్ల సమస్యకు టీడీపీ పశ్చిమ యూత్ ప్రెసిడెంట్ గుత్తుల మధుబాబు చొరవతో పరిష్కారం లభించింది. ఏకేసీ కాలనీలో వీధి లైట్లు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను మధుబాబు ఎమ్మెల్యే గణబాబు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి 6 వీధుల్లో, 6 స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేయించారు. గురువారం విద్యుత్ దీపాల ఏర్పాటు పనులను మధుబాబు పర్యవేక్షించారు. జీవీఎంసీ సిబ్బంది, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదభరితం



ప్రమాదభరితంగా ఇనుప స్తంభం అడుగు భాగం

విశాఖ విద్య: గోపాలపట్నం–ఎన్‌ఏడీ బీఆర్‌టీఎస్ రోడ్‌లో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారికి సమీపాన రోడ్డుపై ఉన్న ఇనుప స్తంభం ప్రమాదభరితంగా మారింది. ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ కిందకు భారీ వాహనాలు రాకుండా, గతంలో ఇక్కడ రహదారికి ఇరువైపులా ఇనుప స్తంభాలతో కూడిన బారికేడ్‌ను ఏర్పాటు చేశారు. ఇనుప స్తంభాలను తొలగించినా, రోడ్డుపై కొంత భాగం వదిలేయడంతో ఆ దారిలో వచ్చే వాహన చోదకులకు అవి ప్రమాదకరంగా మారాయి. అటుగా వచ్చే వాహన చోదకులు అక్కడ జాగ్రత్తగా చూసుకుని ముందుకు సాగాల్సి ఉంది.

రహదారులపై రాంగ్ పార్కింగ్



బాజీ జంక్షన్ నుంచి ఎన్‌ఏడీకి వచ్చే దారిలో వాహనాల రాంగ్ పార్కింగ్



ఎన్‌ఏడీ నుంచి గోపాలపట్నం వైపునకు వెళ్లే దారిలో ఇలా..

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సెంటర్‌లో కొంతమంది వాహనాలను రహదారులపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఇక్కడ తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎన్‌ఏడీ సెంటర్ నుంచి గోపాలపట్నం వైపు వెళ్లే బీఆర్‌టీస్ రోడ్‌లో.. అదే విధంగా బాజీ జంక్షన్ నుంచి ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ వైపు వచ్చే దారిలో రోజూ ఇదే తంతు కనిపిస్తోంది. ఫ్లై ఓవర్ వద్ద ఉన్న దుకాణాలకు వాహనాలపై వస్తున్న వారు, రహదారి పైనే వాటిని నిలిపి, వ్యాపార లావాదేవీలు చూసుకుంటున్నారు. అదే విధంగా ఇక్కడ ఉన్న ఓ హోటల్‌కు వెళ్లే వారు కూడా గంటల తరబడి వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. వీటికి తోడు ఫ్లై ఓవర్ కింద ఆటోవాలాల ఇష్టారాజ్యం సాగుతోంది. ప్రయాణికులు ఎక్కించుకునేందుకు రహదారి పైనే గంటల తరబడి ఆటోలను నిలుపుతున్నారు. దీంతో ఎన్‌ఏడీ నుంచి గోపాలపట్నం, సింహాచలం రోడ్ వరకు తరచూ ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఎన్‌ఏడీ చుట్టూ ఉన్న విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిపోయే వారితో ఉదయం, సాయంత్రం వేళలో ఇక్కడ రద్దీగా ఉంటుంది. ఇలాంటి చోట రోడ్డుపైనే గంటల తరబడి వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ట్రాఫిక్ నిబంధనల పేరుతో తరచూ ఇదే చోట జరిమానాలు విధించే పోలీసులకు, రోడ్డుపై నిలిపే వాహనాలు మాత్రం ఎందుకు కనిపించటం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఇప్పటికైనా దృష్టి సారించి, ఎన్‌ఏడీ సెంటర్‌లో రోడ్డుపై నిలిపే వాహనాల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నూతన ఆవిష్కరణలపై అవగాహన ముఖ్యం



మాట్లాడుతున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: పరిశోధనా రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణలపై ఎప్పటికప్పుడు అవగాహన పొందాలని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. కెమిస్ట్రీ విభాగంలో గురువారం నానో మెటీరియల్స్ ఫర్ ఎనర్జీ, కెటాలసిస్ అండ్ ఎన్విరాన్మెంట్ జాతీయ సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్న నానో మెటీరియల్స్‌పై సదస్సు నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ వర్తమాన అంశాలను పరిశోధకులకు పరిచయం చేయడానికి, విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించడానికి ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. ఈ రంగంలో నిష్ణాతులతో ప్రత్యేక ప్రసంగాలు ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రా మెడికల్ కాలేజ్ ఆచార్యుడు డాక్టర్ జి.రఘురామారావు నానో మెడిసిన్స్ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విభాగాధిపతి ఆచార్య పి.శ్యామల మాట్లాడుతూ మూడు రోజుల జాతీయ సదస్సులో ఏయూ కెమిస్ట్రీ విభాగంలో చదువుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరినీ భాగం చేస్తూ వారినే వక్తలుగా ఆహ్వానించి ప్రత్యేక ప్రసంగాలలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడిటెక్ గ్లోబల్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ హెచ్.పురుషోత్తం, సదస్సు కన్వీనర్ ఆచార్య టి.శివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఆచార్య వి.సిద్ధయ్య ఆచార్య కె.బసవయ్య, ఆచార్య శైలజ తదితరులు ప్రసంగించారు.

'హోలిస్టిక్ ఎడ్యుకేషన్ ఫర్ ఆల్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగంలో ఇటీవల నిర్వహించిన జాతీయ సదస్సు పరిశోధనా పత్రాల సంకలనం రెండో సంచిక మల్టీ డిసిప్లీనరీ అండ్ హోలిస్టిక్ ఎడ్యుకేషన్ ఫర్ ఆల్‌ను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంపై నిర్వహించిన జాతీయ సదస్సు నూతన ఆలోచనలను, విశ్లేషణలను, పరిష్కార మార్గాలను అందించిందన్నారు. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన నిపుణుల చర్చలు, కీలక ఉపన్యాసాలు విలువైన సూచనలు నూతన విద్యా విధానాన్ని మరింత బలోపేతం చేయడానికి ఉపయుక్తంగా నిలుస్తాయని చెప్పారు. ఈ పుస్తక సంపాదకులను అభినందించారు. ప్రత్యేక సంచిక సంపాదకులు, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, డాక్టర్ బి.ప్రవీణదేవి, డాక్టర్ ఎం.సాల్మన్ రాజు, ఎం.వి.ఎస్.ఎస్ ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తరాంధ్ర మాలల గర్జన' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దళిత నాయకులు

సింథియా: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 8న సిరిపురం లోని గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించనున్న ఉత్తరాంధ్ర మాలల గర్జన కార్యక్రమ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లోని మాటూరి చిన్నారావు అధ్యక్షతన ఏడు వార్డుల దళిత నాయకలు పోస్టర్‌ను ఆవిష్కరించి సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన మాల సామాజిక వర్గాన్ని అభివృద్ధి చేసేందుకు జరుగుతున్న ఉత్తరాంధ్ర మాలల గర్జన కార్యక్రమానికి అత్యధికంగా మాలలను సమీకరించి విజయవంతం చేసేలా పారిశ్రామిక ప్రాంత మాల నాయకులు కృషి చేయాలని కోరారు. ఏడు వార్డుల మాల నాయకులు అంబేడ్కర్ సర్కిల్ నుంచి సిరిపురం గురజాడ కళాక్షేత్రం వరకు ఆదివారం సుమారు 300 బైక్‌లతో ర్యాలీ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళిత నాయకులు గుడాల ఈశ్వరరావు, తంతటి సంపత్‌కుమార్, పి.వి.రమణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి రేపు

కంచరపాలెం: మార్గశిరమాస శుక్ల పక్ష జన్మషష్ఠి మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7న కంచరపాలెం ఊర్వశి కూడలి రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో వేడుకలు నిర్వహించనున్నట్లు శరవణ్ ట్రస్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దేవాల రాజు తెలిపారు. కలశ స్థాపన, గోక్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, పన్నీరు, చందనాభిషేకాలు, ప్రత్యేక పూజలు, సాయంత్రం వల్లీ దేవసేన సమేత స్వామికి కల్యాణం, అనంతరం ఊయల సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావాలని కోరారు.

వాహన చోదకులకు అవగాహన



ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న భూషణం

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీకి చెందిన భూషణం మాస్టారు గురువారం ఎన్‌ఏడీ సెంటర్‌లో వాహన చోదకులకు అవగాహన కల్పించారు. రహదారి భద్రత నియమాలతో కూడిన దుస్తులు ధరించి వేగం వద్దు–ప్రాణం ముద్దు అంటూ వచ్చిపోయే వాహనదారులకు కనిపించేలా ప్లకార్డులను ప్రదర్శించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఉపాధ్యాయుడిగా పనిచేసి, ఉద్యోగ విరమణ చేసి, సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తున్న భూషణం మాస్టారును పలువురు అభినందించారు.

మానవ పరిణామంలో టెక్నాలజీ కీలకం



ద్వితీయ బహుమతి సాధించిన గైస్ విద్యార్థులతో అతిథులు, అధ్యాపకులు

మురళీనగర్ : మానవుడి పరిణామ క్రమం సైన్స్ అండ్ టెక్నాలజీతో ముడిపడి ఉందని ఎమ్మెల్సీ పి.రవీంద్ర బాబు అన్నారు. కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో నిర్వహిస్తున్న ప్రాంతీయ టెక్ ఫెస్ట్ – 2024 ముంగింపు సమావేశం గురువారం సాయంత్రం నిర్వహించారు. పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు శాస్త్రీయమైన భావాలు పెంపొందించుకొని సమాజాభివృద్ధికి దోహదపడాలని కోరారు. విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ మాట్లాడుతూ దేశంలో నైపుణ్యంతో కూడిన మానవ వనరుల కొరత ఉందని, నేటితరం యువతీ యువకులు నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలని సూచించారు. విదేశాలతో పోల్చుకున్నప్పుడు మన దేశంలో 51 శాతం యువత నైపుణ్యం లేనివారు ఉన్నారన్నారు. నైపుణ్య సాధన దిశగా పాలిటెక్నిక్ విద్యార్థులు పయనించాలని సూచించారు. రెండు రోజులుగా నిర్వహించిన పాలిటెక్ ఫెస్ట్‌లో మొదటి రెండు స్థానాలు సాధించిన ప్రాజెక్టులకు నగదు బహుమతులు అందించారు. మొదటి స్థానంలో నిలిచిన ఆల్వార్ దాస్ పాలిటెక్నిక్ విద్యార్థులు రూపొందించిన గ్రావిటేషనల్ బ్యాటరీ ప్రాజెక్టుకు రూ.25 వేలు, రెండో స్థానంలో నిలిచిన కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగు ఇన్‌స్టిట్యూట్ (గైస్) విద్యార్థులు రూపొందించిన యూఏవీ ప్రాజెక్టుకు రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య, కాకినాడ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ బి.బాలకృష్ణ, తుమ్మడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మిడి రామ్ కుమార్, సాంకేతిక విద్యాశాఖ కాకినాడ రీజినల్ డైరెక్టర్ జె.సత్యనారాయణ మూర్తి, డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్, గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ పాల్గొన్నారు.

32 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం ఉన్నతాధికారుల ఆదేశాలతో విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫరీద్ సాహా, సిబ్బంది, స్నిఫర్ డాగ్ (భీమ) సహాయంతో రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌కు చెందిన డానిష్ అనే వ్యక్తి 32 కేజీల గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకుని, గంజాయి సీజ్ చేశారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

బీఆర్‌టీఎస్ రోడ్డును మూసేశారు..

- మర్రిపాలెం – ఎన్‌ఏడీ మార్గంలో డివైడర్లు తొలగించి వాహనాల మళ్లింపు
- ఉత్సవాల పేరిట నిర్వాహకుల అత్యుత్సాహం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



దారి మళ్లింపు కోసం రోడ్డు మధ్యలో తవ్వేసిన డివైడర్



మర్రిపాలెం నుంచి ఎన్‌ఏడీకి వచ్చే బీఆర్‌టీఎస్ రోడ్డులో అడ్డంగా ఏర్పాటు చేసిన బారికేడ్

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సెంటర్ సమీపంలో మర్రిపాలెం వైపు బీఆర్‌టీఎస్ రహదారిని మూసేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి ఓ ప్రైవేటు దేవాలయంలో ఉత్సవాల కోసమని మర్రిపాలెం నుంచి ఎన్‌ఏడీ సెంటర్‌కు వచ్చే ఓ వైపు దారి మొత్తం బారికేడ్లు అడ్డంగా పెట్టి మూత వేశారు. ఆ దారిలో వచ్చే వాహనాలు బీఆర్‌టీఎస్ మధ్య రోడ్డులోకి మళ్లించేలా డివైడర్‌ను కూడా తవ్వేశారు. ఈ నెల 7న నిర్వహించే సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాల కోసమని గురువారం రాత్రి నుంచే ఇలా రహదారి దిగ్బంధనం చేయటం సర్వత్రా చర్చనీయాంశమైంది. రోజువారీ అలవాటులో భాగంగా ఆ దారిలో రయ్‌మని దూసుకొస్తున్న వాహనాలు, రోడ్డు మధ్యలో ఉన్న బారికేడ్లతో సడన్ బ్రేక్ వేయాల్సి వస్తోంది. బీఆర్‌టీఎస్ రోడ్‌లో ఇలాంటి చర్యలకు ఎవరు అనుమతులిచ్చారని, వాహన చోదకులు, ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఉత్సవాల రోజున ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాల్సి ఉండగా.. ఇందుకు విరుద్ధంగా రెండు రోజులు ముందే, రద్దీగా ఉండే దారిలో ఇలాంటి పనులేంటని అసహనం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌టీఎస్ రోడ్‌లో డివైడర్లను తొలగించేందుకు అనుమతులు ఎవరు ఇచ్చారనేది ఉన్నతాధికారుల పరిశీలనలో తేలాల్సి ఉంది.



తవ్విన డివైడర్ మధ్యలో నుంచి ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదవ తరగతిలో ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 పథకం కింద ఇచ్చే ఈ శిక్షణ ఒక్కో అంశంలో మూడు నెలలు ఉంటుందన్నారు. 18 నుంచి 45 సంవత్సరాలలోపు వారు అర్హులని, ఇతర వివరాలకు 7989572891, 8500502395 నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు. శిక్షణ అనంతరం సంబంధిత ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు.

7న చిన్న జీయర్ స్వామి రాక

ఎంవీపీకాలనీ: ఈ నెల 7న త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి ఎంవీపీ కాలనీకి తరలిరానున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు సెక్టార్–6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయాన్ని స్వామీజీ సందర్శించనున్నారని ఆలయ కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. వివిధ ఆలయ కార్యక్రమాల్లో స్వామీజీ పాల్గొంటారని, భక్తులు ఆలయానికి తరలిరావాలని కమిటీ ప్రతినిధులు కోరారు.

రెచ్చిపోతున్న మందుబాబులు

- లారీ డ్రైవర్‌పై తీవ్రంగా దాడి
- నలుగురు అరెస్టు.. వీరిలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్ కూడా..
- ఆందోళనలో డ్రైవర్లు



గాయపడిన లారీ డ్రైవర్ రఫీ



బ్లాక్ ఆయిల్ టెర్మినల్ వద్ద ఆందోళన చేస్తున్న లారీ డ్రైవర్లు

సింథియా: మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో మందుబాబులు రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. ఫూటుగా మద్యం సేవించి కనబడిన వారిపై దాడికి తెగబడుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోవడంలేదని బాధితులు వాపోతున్నారు. బుధవారం ఓ లారీ డ్రైవర్‌పై దాడికి దిగారు. యలమంచిలి ప్రాంతానికి చెందిన షేక్ రఫీ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం హెచ్‌పీసీఎల్ నుంచి 3 గంటల ప్రాంతంలో లారీలో బ్లాక్ ఆయిల్ లోడ్ చేసుకుని వస్తుండగా..కొంత దూరంలో డివైడర్‌పై త్రినాథపురం ప్రాంతానికి చెందిన ఎలక్ట్రిషియన్ తామడ బాలశంకర్, జై ఆంధ్రా కాలనీకి చెందిన పెయింటర్ భార లోకేష్, ఏకేసీకాలనీకి చెందిన డెలివరీ బాయ్ దేవులపల్లి రాజేష్, విశాఖ సిటీ పరిధిలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్ చెవ్వేటి నరేంద్రబాబు బహిరంగంగా మద్యం సేవిస్తున్నారు. ఈ క్రమంలో తామడ బాలశంకర్ ఆకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చి లారీ కింద పడబోయాడు. డ్రైవర్ రఫీ అప్రమత్తమై లారీ ఆపి కిందకు దిగి శంకర్‌ను ప్రశ్నించగా..బాలశంకర్ అసభ్యపదజాలంతో దుర్భాషలాడాడు. ఇంతలో లోకేష్, నరేంద్రలు వెనుక నుంచి వచ్చి లారీ డ్రైవర్‌ను ముఖంపై దాడి చేశారు. దీంతో లారీ డ్రైవర్ రఫీకి కుడి కన్ను కింద తీవ్ర రక్తస్రావం అవడంతో పాటు ఎడమ కంటికి కూడా గాయమైంది. అనంతరం రాజేష్, నరేంద్రలు తల వెనుక భాగలో కర్రతో కొట్టి సమీపంలో ఉన్న పొదల్లోకి తోసేసి, సిమెంట్ రాయిని విసిరేశారు. దీంతో స్థానికులు గమనించి కేకలు వేయడంతో వారంతా అక్కడి నుంచి పారిపోయారు. తీవ్రంగా రఫీని తోటి డ్రైవర్లు గాజువాకలోని ఆర్కే హస్పటల్‌లో చేర్పించారు. గురువారం ఉదయం బ్లాక్ ఆయిల్ టెర్మినల్ వద్ద తమకు రక్షణ లేదంటూ, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని లారీ డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న మల్కాపురం పోలీసులు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

సీజీఎంకు వ్యతిరేకంగా ఆందోళన



దీక్ష శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న యూనియన్ నాయకులు

గోపాలపట్నం: ఎన్‌ఏడీ సీజీఎం తమ విధానాలను మార్చుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆల్ ఇండియ డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరషన్ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం నేవల్ ఆర్మమెంట్ డిపో మెయిన్ గేటు సమీపంలో ఏర్పాటు చేసిన దీక్షాశిబిరం వద్ద విలేకర్లతో మాట్లాడారు. డిఫెన్స్ కోఆర్డినేటర్ కమిటీ చైర్మెన్ వెంకటరావు మాట్లాడుతూ కార్మికులు నెలకు 38 గంటల ఓటీని నమోదు చేస్తారని, అంత కంటే ఎక్కువ పనిచేస్తే స్టోరేజ్ ఓటీగా నమోదు చేస్తారన్నారు. ఈ విధానం డాక్ యార్డ్‌లో, ఎన్‌ఏడీలో 20 ఏళ్లుగా కొనసాగుతోందని వివరించారు. ఫ్యాక్టరీ చట్టం ప్రకారం ఇలా నమోదు చేయకూడదని కొత్తగా వచ్చిన సీజీఎం చెబుతుండడంతో సరికాదన్నారు. జీఎం, లేబర్ ఆఫీసర్ చెప్పినా సీజీఎం పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో తమకు స్టోరేజ్ ఓటీ ఇచ్చేవారని అది కొనసాగించాలని కోరారు. ఎన్‌ఏడీ సీఈ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఏవీ థామస్ మాట్లాడుతూ శుక్రవారం నుంచి 12వ తేదీ వరకు విక్టిమైజేషన్ వ్యతిరేక వారం నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 8న ఎన్‌ఏడీ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామని, శుక్రవారం ట్రేడ్ యూనియన్ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఏడీ సీఈ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసరావు, అధ్యక్షుడు నూక రాజు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అండర్ పాస్‌వేలు



చంద్రనగర్ అండర్‌పాస్‌వే వద్ద నీటిచారలు



నాచుపట్టిన పాతగోపాలపట్నం పాస్‌వే

గోపాలపట్నం: అండర్ పాస్‌వేలు అధ్వానంగా మారాయి. వాడుక నీరంతా పాస్‌వేలో పారుతోంది. దీంతో నిత్యం నీటితో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నాచు పట్టడంతో వాహనాలు, పాదచారులు జారిపడుతున్నారు. గోపాలపట్నం, చంద్రనగర్ అండర్ పాస్‌వేలు ఇబ్బందికరంగా మారినా అధికారులు స్పందించడం లేదు. అలాగే అండర్ పాస్‌వేలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయంలో భయాందోళన వ్యక్తమవుతోంది. పై సమస్యలను తక్షణం పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.